క్లుప్తంగా

కనీస వేతనాలు ఇవ్వాలని వినతి



మచిలీపట్నం టౌన్: నగర పాలక సంస్థ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆయాలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయాలు మాట్లాడుతూ నగర పాలక సంస్థ పాఠశాలల్లో 44 మందిమి 30 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో ఆయాలుగా పని చేస్తున్నామని, జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో తమకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వరలక్ష్మి, నాగలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యా నికేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ప్రారంభించారు. శిబిరంలో 150 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 123 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని ఉచిత శస్త్ర చికిత్సల కోసం రెండు ప్రత్యేక బస్సుల్లో పెదకాకాని ఆస్పత్రికి పంపించారు. డాక్టర్ నీరజ, సిబ్బందితో నేత్ర పరీక్షలు నిర్వహించారు. జమీలా మస్తాన్, కనిగంటి వెంకట నారాయణ, మత్తి శివ, తలశిల లీలామనోహర్ తదితరులు రోగులకు సేవలందించారు.

చెస్‌లో చల్లపల్లి బాలికకు ద్వితీయస్థానం



చల్లపల్లి: గ్రామానికి చెందిన బాలిక గీతార్థ సాయి చెస్ పోటీల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించింది. ఆదివారం కానూరులో స్కాట్ స్ప్రెయిన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో గీతార్థ సాయి అండర్-12 కేటగిరీలో పాల్గొంది. చెస్‌లో ప్రతిభ చూపిన గీతార్థ సాయిని పలువురు అభినందించారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం



చల్లపల్లి: గ్రామ ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) ఆలయానికి విరాళం అందించారు. ఆదివారం స్థానిక గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయానికి ముమ్మనేని నాని-మల్లీశ్వరి దంపతులు రూ.50 వేలు విరాళం అందజేశారు. దాతలను కమిటీ పెద్దలు సన్మానించారు.

50 మందికి ఆక్యుపంక్చర్ చికిత్స

చల్లపల్లి: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ కార్యాలయంలో చల్లపల్లి శాఖ అధ్యక్షులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో శిబిరం ఏర్పాటు చేయగా, డాక్టర్ జేవీ ప్రసాద్ 50 మందికి చికిత్స చేశారు. జూపూడి కిరణ్, నంబూరి శ్రీమన్నారాయణ, దింటకుర్తి జ్యోతి, సత్యవాణి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ విస్తరణ పనులు వేగవంతం

మండవల్లి: నేషనల్ హైవే విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ విస్తరణ పనులు పూర్తి కావడానికి సుమారు రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ ఏసుబాబు పేర్కొన్నారు. విజయవాడ-భీమవరం ఆర్అండ్‌బీ రోడ్డు పరిధిలో కానుకొల్లు సమీపంలో నేషనల్ హైవే విస్తరణ పనులు అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు పూర్తిగా జరిగితే పలు ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టినట్లవుతుందని భావిస్తున్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు



బందరు నిర్మలా కాన్వెంట్ సెంటర్‌లో వన గణనాథుని అలంకారం



పెడనలో బాల గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

- ఆనందోత్సాహాలతో గణనాథుని నిమజ్జనాలు
- అన్నసమారాధనలు.. అలంకారాలు

మచిలీపట్నం టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఏడో రోజుకు చేరుకున్నాయి. మచిలీపట్నం నగరంలో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను భక్తులు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. నగరంలోని పలు కూడళ్ల వద్ద పందిళ్లలో కొలువు దీరిన గణనాథుని విగ్రహాలను ట్రాక్టర్లు, ట్రక్ ఆటోలలో ఊరేగింపుగా తరలించారు. గణనాథుడు ఉన్న వాహనాల ముందు డీజే సౌండ్, తీన్మార్ వాయిద్యాల నడుమ యువత కేరింతలు కొడుతూ నిమ్మజ్జన ఊరేగింపులో పాల్గొని నృత్యాలు చేస్తూ సందడిగా ముందుకు సాగారు. ప్రధాన రహదారి మీదుగా మంగినపూడి బీచ్‌లో, పలు పంట కాలువల్లోనూ గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. గణపతి బొప్పా మోరియా.. అంటూ పెద్ద పెట్టున నినదించారు. నగరంలోని ఎంబీఆర్ షాపింగ్ మాల్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని మాల్ సిబ్బంది ఉత్సాహంగా ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. పలు ప్రాంతాల్లోని గణనాథుని పందిళ్ల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పందిళ్లలో కొలువుదీరిన గణనాథుని విగ్రహాల వద్ద ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు నిర్వహించారు.

పెడన: వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు ఉప్పాల రాము పట్టణంలోని చోడదిక్కులు, దక్షిణ తెలుగుపాలెం తదితర ప్రాంతాల్లో వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. కౌన్సిలర్ శిరివెళ్ల జయేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కోమట్ల అనిల్, బళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఏడు రోజులు మాత్రమే ఏర్పాటు చేసిన పందిళ్లలోని వినాయకుని ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువెళ్లి పెడన రామరాజు చానల్‌లో నిమజ్జనం చేశారు. బాల గణపతి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో 3వ వార్షికోత్సవంలో బాలలు పెద్ద ఎత్తున నిమజ్జనంలో పాల్గొన్నారు.



మంగినపూడి బీచ్ వద్ద నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడి విగ్రహం

మంగినపూడి బీచ్‌లో..

కోనేరుసెంటర్: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు సుమారు 40 విగ్రహాలను మంగినపూడి బీచ్‌లో ఆదివారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో భారీ ఊరేగింపులు నిర్వహించారు. పెద్దలు, యువకులు, పిల్లలు తీన్‌మార్ డప్పులకు చిందులు వేస్తూ గణనాథుడిని సాగనంపారు. మహిళలు స్వామివారికి హారతులు ఇచ్చి జై జై గణేశ... బైబై గణేశ అంటూ వీడ్కోలు పలికారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ ఎస్ఐ చాణక్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులు బీచ్ లోతుకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

కోడూరు: నక్కవానిదారి, మందపాకల, జయపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. యువకులు డీజే పాటలు, డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ గణనాథుడి విగ్రహాలను ఊరేగించారు. లింగారెడ్డిపాలెం, విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, యర్రారెడ్డివారిపాలెం గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బందరులో నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు



కోడూరులో గణనాథుడి విగ్రహానికి హారతులిస్తున్న విద్యార్థినులు



పెడన దక్షిణ తెలుగుపాలెంలో ఉత్సవాలు

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నరేష్‌ను పరామర్శిస్తున్న రమేష్‌బాబు, నరసింహారావు

కోడూరు: మండలంలో ఇటీవల పలువురు మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆదివారం పరామర్శించారు. యర్రారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ పోతుల నరేష్ తండ్రి శ్రీనివాస్ మృతిచెందారు. నరేష్‌తో పాటు కుటుంబ సభ్యులను రమేష్‌బాబు, నరసింహారావులు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఐదో వార్డులో పరిశె సుబ్బారావు మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, వెన్నా ప్రసాద్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రకాష్‌బాబుకి ఎమ్మెల్యే నివాళి



అవనిగడ్డ: విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్‌జేఎస్ ప్రకాష్‌బాబు భౌతిక కాయం వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. శనివారం ఉదయం గుండెపోటుతో ప్రకాష్‌బాబు మృతిచెందారు. సీబీసీఎన్‌సీ స్కూల్ కరస్పాండెంట్‌గా, ఏపీటీఎఫ్ జిల్లా నాయకునిగా, ఉపాధ్యాయుడిగా ఆయన సేవలందించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రకాష్‌బాబు తాను ఎంతో సన్నిహితంగా ఉండేవారమని, ఆయన మరణంతో మంచి మిత్రుడుని కోల్పోయామని చెప్పారు. ఏపీ రైతువిభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు ప్రకాష్‌బాబుకి నివాళులర్పించారు. అనంతరం అవనిగడ్డ శ్మశానవాటికలో ప్రకాష్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు.

తీరంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

- కోడూరు తీరనున్న లోఓల్టేజీ సమస్య
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్ నిర్మాణ పనుల పరిశీలన

కోడూరు: తీరప్రాంత గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసి, ఆక్వా రైతులకు మేలు జరిగేలా రామకృష్ణాపురం వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఉల్లిపాలెం వరకు కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్ పనులను రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆదివారం పరిశీలించారు. మండలంలో తీరప్రాంత గ్రామాలైన రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి, హంసలదీవి, పాలకాయతిప్ప, ఉల్లిపాలెంలో చిన్నపాటి గాలులకే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, దీంతో నిత్యం పై గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్యతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని రమేష్‌బాబు చెప్పారు. ఈ సమస్యలను అధిగమించేందుకు రామకృష్ణాపురంలో ఇప్పటికే సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని 85 శాతానికి పైగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్‌ను అనుసంధానం చేస్తూ ఉల్లిపాలెం సమీపంలోని మొండి వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్ నిర్మాణాన్ని కూడా చేపడుతున్నామని రమేష్‌బాబు చెప్పారు.



నూతన విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

ఆక్వా రైతులకు మేలు..

నూతన ఎక్స్‌ప్రెస్ విద్యుత్ లైన్ వల్ల ఆక్వా రైతులకు కూడా మేలు జరుగుతుందని రమేష్‌బాబు చెప్పారు. రొయ్యల చెరువులకు విద్యుత్ సరఫరాను పూర్తి స్థాయిలో అందించేందుకు సబ్‌స్టేషన్, నూతన విద్యుత్ లైన్ దోహదపడతాయన్నారు. వీటితో పాటు కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌పై అధిక లోడ్ భారం తగ్గుతుందని, దీంతో మండల ప్రజలకు పూర్తిస్థాయిలో లో ఓల్టేజ్ సమస్య నుంచి విముక్తి లభిస్తుందని రమేష్‌బాబు చెప్పారు. ముందుగా విద్యుత్ స్తంభాల ఏర్పాటును ఆ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. విద్యుత్ డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, బీసీ సంఘం మండల కన్వీనర్ లంకే రవి, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్లకు సన్మానం

గుడివాడ టౌన్: క్రీడాకారుల ఖ్యాతి చరిత్రగా మిగిలిపోతోందని ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ సభ్యులు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఆదివారం జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన ఇరువురు వెయిట్ లిఫ్టర్లను ఘనంగా సత్కరించారు. క్రీడలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నేపథ్యంలో రైల్వే ఉద్యోగాలు సంపాదించి ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగులుగా జీవనం సాగిస్తున్న ఇరువురు విశ్రాంత క్రీడాకారులను సన్మానించడం క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని వారు అన్నారు. వీరిలో కంది అప్పారావు విశ్రాంత రైల్వే ఉద్యోగి. రైల్వే క్రీడల్లో ఆల్ ఇండియా గోల్డ్ మెడల్‌తో పాటు జాతీయ పోటీలలో బంగారు పతకం సాధించారు. ఇక రాష్ట్ర స్థాయి పోటీల్లో 15 బంగారు పతకాలు సాధించారు. మరో క్రీడాకారుడు కె.రాయప్ప సదరన్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ ఇటీవల పదవీ విరమణ చేశారు. వీరు నేషనల్ పోటీలలో బంగారు పతకం, రైల్వే ఆల్ ఇండియా పోటీలలో బంగారు పతకం, 10కి పైగా రాష్ట్ర స్థాయి బంగారు పతకాలు సాధించారు. ఇంతటి ఘన చరిత్ర గలిగిన క్రీడాకారులను యువ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని స్టేడియం కమిటీ సభ్యులు కోరారు.



వెయిట్ లిఫ్టర్లను సత్కరిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, కృష్ణా జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ కె.దామోదరరావు, కోచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మయూర ధ్వజుడు హరికథా గానం

నాగాయలంక: స్థానిక వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబా సాయికిరణ్‌శర్మ (కౌశిక్) బ్రహ్మత్వంలో పొన్నూరు రవితేజ, జ్యోతి దంపతులచే ప్రసన్న గణపతి ఆలయంలో, ఉత్సవ విగ్రహ వేదికపై పూజలు జరిగాయి. నిత్య కార్యక్రమాల్లో భాగంగా సబ్బినేని వెంకటేశ్వరరావు (అబ్బాయి) ఆర్థిక సౌజన్యంతో కర్నూలుకు చెందిన టి.సాయిరామ్ భాగవతార్‌చే మయూర ధ్వజుడు హరికథా గానం జరిగింది. పాపర్తి ఆంజనేయులు (అవనిగడ్డ) వయొలిన్, ఎం.నగధరరావు(తెనాలి) మృదంగంతో సహకరించారు. ఈ కార్యక్రమం భక్తులను అలరించింది.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగాయలంక ప్రసన్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం 108 మంది భక్తులచే సంపూర్ణ భగవద్గీత పారాయణం జరుగుతుందని కమిటీ అధ్యక్షుడు మండవ బాలవర్ధిరావు, ప్రతినిధి చిట్టా సాంబశివరావు ఆదివారం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మయూర ధ్వజుడు హరికథా గానం చేస్తున్న సాయిరామ్ భాగవతార్

ఇంటింటా ఆరోగ్య సర్వే



మాదలవారిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్షా సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆదివారం ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను నమోదు చేస్తున్నారని మండల వైద్యాధికారి ఆనంద్‌బాబు చెప్పారు. అంతేగాక వారి డేటాను నమోదు చేయడం, అనంతరం ఏర్పాటు చేసే వైద్య ఆరోగ్య శిబిరాలలో డాక్టర్‌లచే వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. మాదలవారిగూడెం గ్రామంలో ఏఎన్ఎం మేరీగ్రేస్ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి

పమిడిముక్కల: ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సహకారంతో మండలాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎంపీటీసీలుగా ప్రమాణస్వీకారం చేసి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ కేక్ కట్ చేశారు. ఎంపీటీసీలకు ఎంపీడీఓ విఠల్‌పాల్, ఎంపీపీ సుప్రజ మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుప్రజ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఏఓ రాజు, ఈవోపీఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు మీర్జా సజ్జాద్ అలీ, మరీదు రాజ్యలక్ష్మి, గుర్విందపల్లి వంశీ, వీర్ల ఆదిశేషు, జుజ్జువరపు శృతి, మేరుగ రాజేశ్వరి, ఊబ మల్లేశ్వరి, కంచర్ల అంకకుమారి పాల్గొన్నారు.

మొవ్వ: మండల అభివృద్ధికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అండదండలతో, మండల అధికారుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. మండల పరిషత్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సమావేశం నిర్వహించారు. ముందుగా అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులకు, పలు గ్రామాల ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్, ఎంపీడీఓ జి. సుధాప్రవీణ్, పలు గ్రామాల ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు ఎంపీపీ, చందు దంపతులను సత్కరించారు.



ఎంపీటీసీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కాసాని వేద సుప్రజ

భారీగా అన్నసమారాధనలు

బంటుమిల్లి: మండలంలోని గణేష్ ఉత్సవ పందిళ్ల వద్ద ఆదివారం పెద్దఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. బంటుమిల్లి సంతబజారు, ఆర్టీసీ బస్టాండు, జానకీరామపురం, చోరంపూడి తదితర పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన సమారాధనలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా బంటుమిల్లి సంతబజారు, దొడ్డాక వీధి, చోరంపూడి, జానకీరామపురం సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన గణనాథులను యువకులు డీజే, మేళతాళాలు, కనకతప్పెట్లతో ఊరేగించి బంటుమిల్లి ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.

చిట్టిపాలెంలో..

కోనేరుసెంటర్: అరిశేపల్లి పంచాయతీ శివారు చిట్టిపాలెంలో ఆదివారం గణపతి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అన్నసమారాధన నిర్వహించారు. వారం రోజులు పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శనివారం రాత్రి స్వామివారి లడ్డూను వేలం వేశారు. గ్రామానికి చెందిన చండిక హరికృష్ణ రూ. 13,500లకు దక్కించుకున్నారు. కార్యక్రమాలను పందిరి నిర్వాహకులు పర్యవేక్షించారు.

ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం

గన్నవరం: ప్రజానాట్య మండలి కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలను జనంలోకి తీసుకువెళ్లేందుకు కళాజాతాలు దోహదపడతాయని చెప్పారు. వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పాటలు, నాటికలు, నృత్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ కళలను ఆదరించే ప్రజలు ఉన్నంత కాలం ప్రజానాట్య మండలి కొనసాగుతూనే ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ కాశిం, శిక్షకులు ఎం. పరమేష్, పలు జిల్లాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు జరిగే కార్యక్రమంలో అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి నడుపుతున్న బస్ సర్వీసులపై సెల్: 99592 25466 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు.

ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు

పెడన: ఈక్రాప్ నమోదు గడువును ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు పొడిగించిందని, ఇంకా ఎవరైనా ఉంటే వెంటనే నమోదు చేయించుకోవాలని పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 19,592 ఎకరాలకుగాను ఇప్పటివరకు 15,295 ఎకరాలు ఈ క్రాప్‌లో నమోదయ్యాయని చెప్పారు. మిగిలిన రైతులు కూడా తక్షణం తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వేసిన పంట రకం, ఆధార్ నంబర్, పట్టదారు పాస్ పుస్తకం నంబర్, ఫోన్ నంబర్ చెప్పి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ క్రాప్‌లో పేరు నమోదు చేసుకుంటేనే వేసిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అందే రైతు వారి సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా వంటి వాటికి కూడా వర్తిస్తోందని వివరించారు.